నేడు మంత్రిగా బాధ్యతలు స్వీకరించనున్న సంధ్యారాణి

పార్వతీపురం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా గుమ్మిడి సంధ్యారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. రాష్ట్ర సచివాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం రెండు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించే అవకాశం ఉంది. ఆయా శాఖల్లో నెలకొన్న పరిస్థితి, బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించనున్నారు. అదేవిధంగా ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ఆయా శాఖల్లో ప్రక్షాళన కూడా చేయనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఆమె పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి కూటమి శ్రేణులు బయల్దేరారు.

జీసీసీ.. మారేనా పరిస్థితి?

- గిరిజన సహకార సంస్థకు పూర్వ వైభవం వచ్చేనా..
- గత వైసీపీ ప్రభుత్వ తీరుతో గాడి తప్పిన నిర్వహణ
- సిబ్బంది కొరత.. శిథిలావస్థలో డిపోల భవనాలు
- కోల్డ్ స్టోరేజీలు కరువు
- అంతంతమాత్రంగానే అటవీ ఉత్పత్తుల సేకరణ
- గిరిజనులకు లభించని గిట్టుబాటు ధర
- నూతన ప్రభుత్వంపైనే ఆశలు



సాలూరులో జీసీసీ కార్యాలయం

పార్వతీపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి)

గిరిజన సహకార సంస్థ (జీసీసీ) దినావస్థకు చేరుకుంటోంది. దాని ద్వారా గిరిజనులకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. ముఖ్యంగా గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా జీసీసీ నిర్వహణ గాడి తప్పింది. జిల్లాలో అవసరమైన వనరులు ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో సిబ్బంది లేక ఏటా నిర్దేశించిన లక్ష్యాలను కూడా చేరుకోలేకపోతోంది. కోల్డ్ స్టోరేజీలు, గోదాముల్లో సరైన వసతులు లేకపోవడంతో గిరిజనుల నుంచి ఆశించిన మేర అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయడం లేదు. మొత్తంగా గత వైసీపీ పాలన తీరుతో దయనీయ స్థితికి చేరిన జీసీసీకి పూర్వ వైభవం తేవాల్సిన బాధ్యత నూతన ప్రభుత్వం, ప్రజాప్రతినిధులపై ఉంది. గిరిజనుల అటవీ ఉత్పత్తులను మద్దతు ధరకు కొనుగోలు చేసి.. గిరిజన సహకార సంస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అటవీ ఉత్పత్తుల సాగుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు వాటికి మార్కెట్ సదుపాయం కల్పిస్తే.. గిరిజనులకు ఎంతో మేలు జరుగుతుంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో ఒకప్పుడు సుమారు 20 రకాల అటవీ ఉత్పత్తులు పుష్కలంగా లభించేవి. ప్రధానంగా తేనె, మైనం, చింతపండు, ఇండిగపిక్కలు, ముసిడిక పిక్కలు, మారేడు గడ్డలు, వెప్ప పువ్వు, కాగుపువ్వు, కరక్కాయలు, గచ్చకాయలు, నరమామిడిచెక్క, కొండచీపుర్లు, కుంకుడుకాయలు, ఎండ ఉసిరిపప్పు, నల్లజీడిపిక్కలు తదితర వాటిని విక్రయిస్తూ గిరిజనులు జీవనం సాగించేవారు. అయితే కాలక్రమంలో అటవీ ప్రాంతం తగ్గడం, తదితర కారణాల వల్ల గిరిజనులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని రకాల అటవీ ఉత్పత్తులు మాత్రమే లభిస్తుండగా.. వాటికి కూడా గిట్టుబాటు ధర దక్కడం లేదు. వివిధ కారణాలతో జీసీసీ అధికారులు పూర్తిస్థాయిలో అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయడం లేదు. గిట్టుబాటు ధర కూడా కల్పించడం లేదు. దీంతో గిరిజనులు తమ అటవీ ఉత్పత్తులను నష్టానికే మైదాన ప్రాంతాల వ్యాపారులకు విక్రయించాల్సి వస్తోంది.

రెగ్యులర్ సిబ్బంది లేక..

ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు ప్రత్యేక సేవలు అందించాల్సిన జీసీసీ డిపోలను రెగ్యులర్ సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో అవి ఉత్సవ విగ్రహాలుగా మారాయి. గుమ్మలక్ష్మీపురం పరిధిలో 46, సాలూరులో 38, పార్వతీపురంలో 17 డిపోలు ఉన్నాయి. మొత్తం 101 డిపోల పరిధిలో 14 మంది రెగ్యులర్ సేల్స్‌మెన్ ఉన్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. 18 డిపోలకు ఎటువంటి సిబ్బంది లేరు. కాగా మిగితా వాటిని కాంట్రాక్ట్ సేల్స్ మెన్, మహిళా సంఘాల, డీలర్లు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇన్‌చార్జిల నేతృత్వంలోనే డిపోలను నిర్వహించాల్సిన పరిస్థితి పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఉంది. సీతంపేట ఐటీడీఏ పరిధిలోనూ పూర్తిస్థాయిలో సేల్స్‌మెన్‌లు లేరు. దీంతో డిపోల ద్వారా గిరిజన ప్రాంతాల ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు.

కోల్డ్ స్టోరేజీలు ఎక్కడ...

జీసీసీకి జిల్లాలో ఎక్కడా కోల్డ్ స్టోరేజీలు లేవు. దీంతో ఏటా లక్షలాది రూపాయలను ప్రైవేట్ వ్యాపారులకు కట్టబెడుతున్నారు తప్ప సొంతంగా ఏర్పాటు చేసుకోలేకపోతున్నారు. విశాఖపట్నం జిల్లా ఆనందపురం సమీపంలో ఉన్న వేములవలస వద్ద కోల్డ్‌స్టోరేజ్ నిర్మాణాన్ని చేపట్టారు. కానీ అవసరమైన యంత్రాలు రాకపోవడంతో ఆ పనులు పూర్తికాలేదు. సుమారు రూ. మూడు నుంచి నాలుగు కోట్లు వెచ్చిస్తే.. మూడు జిల్లాల పరిధిలో గిరిజన రైతుల నుంచి కొనుగోలు చేసిన చింతపండును జీసీసీ కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ చేసుకోవచ్చు. కానీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా జీసీసీకి కోల్డ్‌స్టోరేజ్ ఏర్పాటు చేస్తే.. ఏటా లక్షల రూపాయలు ఆదా చేసుకోవచ్చు. ప్రైవేట్ వ్యాపారులకు అద్దె ప్రాతిపదికన భారీగా చెల్లించాల్సిన అవసరం ఉండదు. గిరిజన రైతులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

నిరుపయోగంగా విలువైన స్థలాలు..

గిరిజన సహకార సంస్థకు ఉమ్మడి జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం ఎస్.కోటతో పాటు విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో విలువైన స్థలాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో షాపింగ్ కాంప్లెక్స్ తదితర కమర్షియల్ గొడౌన్లు నిర్మిస్తే జీసీసీకి ఆదాయం ఎంతో వస్తుంది. కానీ దీనిపై అధికార యంత్రాంగం దృష్టి కేం ద్రీకరించడం లేదు. ఈ విషయాన్ని పాలకులకు చెప్పినా పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో జీసీసీకి చెందిన విలువైన స్థలాలు నిరుపయోగంగా మారాయి.

ప్రతిపాదనలు పంపించాం..

కొన్ని జీసీసీ డిపోలకు మరమ్మతులకు చేయాల్సిన మాట వాస్తవమే. నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే భవనాలు మరమ్మతులను చేపడతాం. జిల్లా పరిధిలో జీసీసీకి సొంతంగా కోల్డ్ స్టోరేజీలు లేవు. అయితే విశాఖ జిల్లా ఆనందపురం వద్ద కోల్డ్ స్టోరేజ్ నిర్మాణంలో ఉంది.

-మహేంద్ర, జీసీసీ డివిజనల్ మేనేజర్, పార్వతీపురం డివిజన్

వైసీపీ పాలనలో...

గుమ్మలక్ష్మీపురం: వైసీపీ ప్రభుత్వ పాలనలో గిరిజన సహకార సంస్థ పూర్తిగా నీరసించిపోయింది. గిరిజనుల నుంచి అంతంతమాత్రంగానే అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేశారు. నాటి ప్రభుత్వపెద్దలు, అధికారులు తగిన శ్రద్ధ తీసుకోని కారణంగా జీసీసీ తేనె, సబ్బులు, పసుపు, కారం, కాయపౌడరు, కుంకుడుకాయ పౌడర్ అమ్మకాలు గణనీయంగా పడిపోయాయి. అరకు కాఫీ కూడా అంతంతమా త్రంగానే అమ్మకాలు సాగాయి. ఈ సంస్థ పనితీరు ఆశించిన విధంగా లేకపోవడంతో వ్యాపార లావాదేవీలు కూడా గణనీయంగా పడిపోయాయి. గత ఐదేళ్లలో ఎంతోమంది ఉద్యోగులు రిటైర్డ్ అయినా కొత్తగా నియామకాలు చేపట్టలేదు. కొంతమంది రిటైర్డ్ ఉద్యోగులు జీసీసీ నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం వారికి పింఛను, ఇతర బెనిఫిట్స్ రావడం లేదు. మరోవైపు కొందరు అధికారుల అవినీతి కారణంగా సంస్థకు తీవ్ర నష్టం వాటిల్లిందనే వ్యాఖ్యలు లేకపోలేదు.



సాలూరు మండలం సారికలో మరమ్మతులకు నోచని డిపో

శిథిలావస్థలో డిపోలు...

పార్వతీపురం జీసీసీ పరిధిలో ఉన్న అనేక డిపోలు శిథిలావస్థలో ఉన్నాయి. ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి. దీంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. భవనాల మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాలని అధికారులు ప్రతిపాదనలు పంపినా మోక్షం కలగలేదు. గోదాముల పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉంది.


గుమ్మలక్ష్మీపురంలో గిరిజన సహకార సంస్థ కార్యాలయం


సీతంపేటలో డివిజనల్ కార్యాలయం

లక్ష్యాలు చేరుకోలేక..

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలో 56 డీఆర్ డిపోలు ఉన్నాయి. వాటిల్లో 11 డిపోలను రెగ్యులర్ సిబ్బందితో, మిగతా వాటిని గిరిజన యువతతో నిర్వహిస్తున్నారు. ఏటా వ్యాపార లక్ష్యం రూ.65 కోట్లుగా నిర్దేశించగా ఆ స్థాయిలో వ్యాపార నిర్వహణ జరగడం లేదనే ఆరోపణలున్నాయి. గిరిజనుల నుంచి అటవీ ఉత్పత్తుల సేకరణ, డీఆర్ డిపోల ద్వారా నిత్యావసరాల విక్రయాలపై జీసీసీ అధికారులు దృష్టి సారించడం లేదు. కేవలం ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలు, పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లకు నిత్యావసరాల పంపిణీపైనే శ్రద్ధ వహిస్తున్నారు. దీంతో వ్యాపార లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారు. జీసీసీ గతంలో వారపు సంతల్లో స్టాక్‌పాయింట్లు ఏర్పాటు చేసి నిత్యావసర సరుకులు అమ్మకాలు చేపట్టేవారు. సిబ్బంది కొరత అని చెప్పి.. వాటిని కూడా ఎత్తివేశారు. సీతంపేట, పాతపట్నం డివిజనల్ మేనేజరే విశాఖపట్నంలో జనరల్ మేనేజర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సేల్స్‌మేన్‌లు, మేనేజర్లు పూర్తిస్థాయిలో లేరు. దీంతో జీసీసీ వ్యాపార లక్ష్యాలు మందగిస్తున్నాయి.

ఐదేళ్లూ.. గాలికొదిలేశారు!

- అధ్వానంగా మారిన తోటపల్లి పార్కు
- అభివృద్ధిపై దృష్టి సారించని గత వైసీపీ ప్రభుత్వం
- నిర్వహణకు నిధులూ మంజూరు చేయని వైనం
- తగ్గిన పర్యాటకుల సంఖ్య

గరుగుబిల్లి: గరుగుబిల్లి మండలం సుంకి ప్రాంతం.. నాగావళి నది సమీపంలో ఏర్పాటు చేసిన తోటపల్లి పార్కు అధ్వానంగా మారింది. తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని కుడి మట్టికట్టకు ఆనుకుని గతంలో పార్వతీపురం ఐటీడీఏ అధికారులు దీనిని ఏర్పాటు చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. దీంతో నిత్యం వందలాది మందితో పర్యాటకులతో పార్కు కళకళలాడేది. అయితే వైసీపీ అధికారం లోకి వచ్చిన తర్వాత సీన్ మారింది. గత ఐదేళ్లలో పార్కు అభివృద్ధిని పట్టించుకోలేదు. కనీసం దాని నిర్వహణకు కూడా నిధులు మంజూరు చేయలేదు. వాస్తవంగా 2012లో రూ. 41.92 లక్షల వ్యయంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పార్కు అభివృద్ధికి నిధులు మంజూరు చేసింది. ఆ తర్వాత టీడీపీ ప్రభుత్వ హయాంలో కొంతమేర నిధులు కేటాయించారు. దీంతోపార్కు అభివృద్ధితో పాటు బోటు షికారు నిర్వహణ ఉండేది. అయితే వైసీపీ ప్రభుత్వంలో పార్కు అభివృద్ధి పూర్తిగా పడకేసింది. ప్రస్తుతం పార్కు కళావిహీనంగా మారింది. క్రీడా సామగ్రి, పలు పరికరాలు, ఆట వస్తువులు శిథిలమయ్యాయి. దీంతో ఇక్కడకు వచ్చే సందర్శకుల సంఖ్య కూడా తగ్గింది. వైసీపీ సర్కారు తీరుతో ఒకవైపు పార్కు, మరోవైపు బోటు షికారుకు కూడా ఆదరణ తగ్గింది. గత రెండు రోజుల కిందట కురిసిన వర్షం, భారీ గాలులకు పార్కు ఆవరణలో చెట్లు కూలి పోయాయి. వీటిని తొలగించే ప్రయత్నాలు చేయలేదు. చిన్నారులు ఆడుకునే ట్రాంపాలిన్ బౌన్సీ, ఉయ్యాల పనికి రాని విధంగా తయారయ్యాయి. మరోవైపు ప్రవేశ రుసుం రూ. 20 చొప్పున వసూలు చేస్తున్నా.. పార్కులో సౌకర్యాలేవీ లేకపోవడంతో ఈ ప్రాంత పర్యాటకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలో పార్కు పర్యవేక్షణకు పార్వతీపురం ఐటీడీఏ ఆధ్వర్యంలో నలుగురు సిబ్బంది ఉండేవారు. ప్రస్తుతం ఇద్దరు వ్యక్తులకు కుదించారు. వీరికి నెలకు రూ. 7,500 గౌరవ వేతనం అందిస్తున్నారు. ఒకవైపు పర్యాటకులు రాకపోవడంతో వీరి గౌరవ వేతనాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పార్కులో ఏ మూల చూసినా శిథిల సామగ్రి దర్శనమిస్తుంది. నూతన ప్రభుత్వం, ఉన్నతాధికారులు చొరవ చూపి పార్కును పూర్తిస్థాయిలో ఆధునికీకరించాలని పర్యాటకులు కోరుతున్నారు.



పార్కులో కూలిన చెట్లు, పాడైన ఆట సామగ్రి


బోసిపోయిన ఐటీడీఏ పార్కు

అధికారుల దృష్టికి సమస్యలు

పార్కులో నెలకొన్న సమస్యలను ఐటీడీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పలు ఆట వస్తువులు, సామగ్రి పనికి రాని విధంగా తయారవడంతో పర్యాటకుల సంఖ్య తగ్గింది. గుర్రపు డెక్క కారణంగా బోటు షికారుకు బ్రేక్ పడింది. పార్కు ప్రాంతం కళావిహీనంగా మారడంతో పలువురు వచ్చి తిరిగి వెళ్తున్నారు. పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తే తగిన గుర్తింపు వస్తుంది.

-పార్కు సిబ్బంది

చిన్నపాటి వర్షానికే కొట్టుకుపోయిన పారాది కాజ్‌వే

- గత పాలకుల పాపం
- రూ.90 లక్షల ప్రజాధనం వృథా
- తప్పని అవస్థలు
- భారీ వాహనాల దారి మళ్లింపు

బొబ్బిలి, జూన్ 16: గత పాలకుల పాపం.. నాయకుల కక్కుర్తి ఫలితంగా రూ.90 లక్షల ప్రజాధనం నీటిలో కొట్టుకుపోయింది. బొబ్బిలి సమీపంలో పారాది వంతెన వద్ద వేగావతి నదిలో వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాజ్‌వే ఆదివారం కురిసిన చిన్నపాటి వర్షానికే కొట్టుకు పోయింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వాహనాలను అధికారులు దారి మళ్లిస్తున్నారు.

రాకపోకలను నిషేధించి.. తరువాత అనుమతించి

కాజ్‌వే కొట్టుకుపోవడంతో భారీ వాహనాలు, ఇతర ప్రయాణికులు రాకపోకలు సాగించవద్దని బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు తొలుత ప్రకటించారు. రామభద్రపురం మీదుగా వచ్చే వాహనాలు రాజాం మీదుగా, పార్వతీపురం నుంచి వచ్చే వాహనాలను బలిజిపేట రోడ్డు నుంచి గొల్లపల్లి, కారాడ, మీదుగా దారి మళ్లిస్తున్నట్లు డీఎస్పీ వివరించారు. ఆ తరువాత ఆయనతో పాటు ఎస్ఐ లోవరాజు, ఆర్అండ్‌బీ జేఈ రాజు కలిసి కాంట్రాక్టరును కాజ్‌వే వద్దకు రప్పించారు. తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. అనంతరం వాహనాల రాకపోకలకు అనుమతిచ్చారు. మరో పెద్ద వర్షం వస్తే కాజ్‌వే గోవిందా..గోవిందా.. అంటూ స్థానికులు ఎద్దేవా చేస్తున్నారు.

నాడే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

పదహారు సిమెంట్ పైపులతో నిర్మించిన కాజ్‌వే నాణ్యతపై ఐదు నెలల కిందటే 'ఆంధ్రజ్యోతి' హెచ్చరించింది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి విశాఖ వైపు తరచుగా అతిపెద్ద లోడులతో భారీ వాహనాలు ఈ రహదారి గుండా నిత్యం గొలుసుకట్టు మాదిరిగా వెళుతుంటాయి. అలాంటి సందర్భాల్లో కాజ్‌వే ఎలా తట్టుకుంటుందని 'ఆంధ్రజ్యోతి' హెచ్చరించింది. వర్షాలు కురిస్తే కొట్టుకుపోతుం దని అని కూడా చెప్పింది. అప్పట్లో ఆర్అండ్‌బీ అధికారులు చేసిన సూచనలను కాంట్రాక్టర్ పెడచెవిన పెట్టడంతో ఇప్పుడు చిన్నవర్షానికే కొట్టుకుపోయింది.


కొట్టుకుపోయిన కాజ్‌వేను పరిశీలిస్తున్న బొబ్బిలి డీఎస్పీ

ఇదీ పరిస్థితి..

చిలకపాలెం-రాయగడ జాతీయ రహదారిలో బొబ్బిలి మండలం పారాది గ్రామ సమీపంలో వేగావతి నదిపై బ్రిటీష్ కాలంలో వంతెనను నిర్మించారు. అయితే ఈ వంతెన శిథిలావస్థకు చేరడంతో గతేడాది నుంచి భారీ వాహనాల రాకపోకలను అధికారులు నిలిపివేశారు. తాత్కాలికంగా బ్రిడ్జిని ఇనుప గడ్డర్లపై నిలబెట్టి తేలికపాటి వాహనాల రాకపోకలకు అనుమతినిచ్చారు. భారీ వాహనాలను ఈ బ్రిడ్జి వెళ్లేందుకు అనుమతి లేదు. ఒడిశా నుంచి బొబ్బిలి మీదుగా విశాఖ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే భారీ వాహనాలను పార్వతీపురం నుంచి పాలకొండ, రాజాం మీదుగా, అలాగే విశాఖ తదితర ప్రాంతాల నుంచి బొబ్బిలి మీదుగా ఒడిశాకు వెళ్లాల్సిన భారీ వాహనాలను సైతం రామభద్రపురం, రాజాం, పాలకొండ, పార్వతీపురం మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో గమ్యస్థానానికి చేరాలంటే 100 నుంచి 150 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సిన దుస్థితి ఎదురైంది. ఈ పరిస్థితుల్లో ఐదు నెలల కిందట పారాది వంతెనకు సమాంతరంగా కాజ్‌వే నిర్మాణంపై అప్పటి అధికార పార్టీ నాయకులు దృష్టి పెట్టారు. అనుకున్నదే తడవుగా రూ.90 లక్షలతో పనులు చేపట్టారు. కాజ్‌వే కోసం పారాది గ్రామం ముందు ఉన్న రచ్చబండ, పచ్చని చెట్టును తొలగించారు. తాత్కాలిక పనులతో మమ అనిపించారు. కాజ్‌వే నిర్మాణం పూర్తయిన తరువాత వర్షాలు కురవకపోవడంతో వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. అయితే రెండ్రోజుల కిందట కురిసిన చిన్నపాటి వర్షానికే కాజ్‌వే కొట్టుకుపోయింది. దీంతో వంతెన నిర్మాణంలో నాణ్యత బట్టబయలైంది. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. నిధులు బుక్కేసిన నేతల పరువు గంగపాలైంది. ఆంధ్రా-ఒడిశా మధ్య రాకపోకలు సాగించే భారీ వాహనదారులకు వెతలు ప్రారంభమయ్యాయి.

తనిఖీలయ్యే వరకు సరుకులు పంపిణీ చేయొద్దు

- స్టాక్ పాయింట్లకు జిల్లా పౌరసరఫరాల శాఖ ఆదేశాలు
- ఆందోళనలో అధికారులు

సీతంపేట: పౌరసరఫరాల శాఖ ద్వారా సరఫరా చేస్తున్న సరుకుల తూకాల్లో తేడాలున్నాయని, తనిఖీ బృందాలు పరిశీలించే వరకు వాటిని పంపిణీ చేయొద్దని జిల్లా పౌరసరఫరా అధికారులు మండల స్టాక్ పాయింట్లకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో సివిల్ సప్లయిస్ అధికారుల్లో ఆందోళన నెలకొంది. ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాదెండ్ల మనోహర్ నెల్లూరు జిల్లాలో ఇటీవల సివిల్ సప్లయిస్ గోదాములను ఆకస్మిక తనిఖీ చేశారు. పంచదార, ఆయిల్, కందిపప్పు ప్యాకెట్లు తూకాల్లో తేడాలు ఉన్నాయని, వీటిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక అందించాలని పౌరసరఫరాల అధికారులు, కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లాలోని మండల సివిల్ సప్లయిస్ గోదాముల్లో ఉన్న కందిపప్పు, పంచదార, ఆయిల్ ప్యాకెట్లను తనిఖీ బృందాలు పరిశీలించే వరకు స్టాక పాయింట్లకు పంపిణీ చేయవద్దని ఆదేశాలు జారీ చేశారు. దీంతో సివిల్ సప్లయిస్ గోదాము నిర్వాహకులు సరుకులు పంపిణీ చేయలేదు. స్టాక్ పంపిణీదారులు నుంచి వచ్చిన సరుకులను యథావిధంగా గోదాముల్లో ఉంచారు. జిల్లాలో రెండ లక్షల 81 వేల రేషన్ కార్డుదారులు ఉన్నారు. ప్రతి నెలా 157.561 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. దానితో పాటు 500 గ్రాములు పంచదార, కేజీ కందిపప్పు పంపిణీ చేస్తున్నారు. అయితే వాటి ప్యాకింగ్‌లో తేడాలు ఉండకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత జిల్లా శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఆదివారం స్థానిక మండల సివిల్ సప్లయిస్ గోదామును డీటీ మధుసూదనరావు పరిశీలించారు. గోదాంలో ఉన్న నిల్వలను పరిశీలించి స్టాక్ పాయింట్లకు పంపిణీ చేయవద్దని ఆదేశించారు. తదుపరి ఆదేశాలు వచ్చిన వరకు నిల్వలు యథావిధంగా ఉంచాలని గోదాం ఇన్‌చార్జి కన్నబాబును ఆదేశించారు.


సీతంపేట సివిల్ సప్లయిస్ గోదాములో పంచదార ప్యాకెట్ తూకం వేసి చూస్తున్న డీటీ

తేనెటీగల దాడిలో విశ్రాంత జవాన్ మృతి

వెలిగండ్ల, జూన్ 16: తేనెటీగల దాడిలో విశ్రాంత జవాన్ మృతి చెందిన ఘటన ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం ఇమ్మడిచెరువులో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జుటికే సుందరరావు (57) సీఆర్‌పీఎఫ్‌లో జవాన్‌గా పనిచేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. శనివారం ఆయన భార్య రోజమ్మతో కలిసి కనిగిరిలో బ్యాంకుకు ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. బాపనపల్లి గ్రామ సమీపంలోకి చేరుకునే సరికి ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. దీంతో భార్యాభర్తలు పంట పొలాల్లోకి పరుగులు తీశారు. అయినప్పటికీ తేనెటీగలు వదలలేదు. ఆ సమయంలో అటుగా ఆటోలో వెళ్తున్న వారు ముఖాలకు కండువాలు కప్పుకుని వెళ్లి భార్యాభర్తలను కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సుందరరావు మృతి చెందినట్టు నిర్ధారించారు. చికిత్స అనంతరం రోజమ్మ కోలుకున్నారు.

ఒంటరి ఏనుగు దాడిలో రైతు మృతి

రామకుప్పం, జూన్ 16: చిత్తూరు జిల్లా కుప్పం రామకుప్పం మండలం పీఎం తాండా సమీపంలో శనివారం రాత్రి ఏనుగు దాడిలో ఓ రైతు మృతి చెందారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో పొలం వద్ద షెడ్‌లో ఆవులను కట్టేసి రైతు కన్నానాయక్ ఇంటికి వెళుతున్నారు. మార్గమధ్యలో తన టమోటా తోటను ఒంటరి ఏనుగు ధ్వంసం చేయడం గమనించిన ఆయన భయంతో పరుగుతీశారు. కొద్ది దూరం వెళ్లగానే కింద పడిపోగా ఒంటరి ఏనుగు దాడిచేసి, తొండంతో దూరంగా విసిరేసింది. దీంతో కన్నానాయక్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అటవీశాఖ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



ఇందిరాగాంధీ స్టేడియంలో నిలిచిన వర్షపు నీరు..



గుణదల సమీపంలో వాహనంతో చిరు వ్యాపారి ఇక్కట్లు..



ఏలూరు రోడ్డులో జోరుగా కురుస్తున్న వాన..

భారీ వర్షానికి విజయవాడ అతలాకుతలం

- గంటసేపు దంచికొట్టిన వాన
- నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు
- చెరువుల్లా మారిన రహదారులు

విజయవాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరంలో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో గంట సేపు కురిసిన వర్షానికి నగరంలోని రహదారులు చెరువుల్లా మారాయి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కాగా, నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఎదురుగా ఉన్న మహాత్మాగాంధీ రోడ్డులో వర్షం నీరు నిలిచిపోయిన ప్రాంతాన్ని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్‌తో కలిసి పురపాలకశాఖ మంత్రి నారాయణ పరిశీలించారు. భవిష్యత్తులో వరద నీరు రోడ్లపై నిలవకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, జలమయం అయ్యే ప్రధాన రహదారులను క్షేత్రస్థాయిలో పర్యటించిన మంత్రి.. అధికారులకు సూచనలు చేశారు.

అక్కడక్కడా భారీ వర్షాలు

విశాఖపట్నం, అమరావతి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో ఆదివారం కోస్తా జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు కురిశాయి. కాకినాడ రూరల్‌లో 83, ఏలూరు జిల్లా నిడమర్రులో 80, విజయనగరంలో 70, అల్లూరి జిల్లా కూనవరంలో 48.5, తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో 48.5, పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో 47.5, కృష్ణా జిల్లా పమిడిముక్కలలో 31.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం అల్లూరి జిల్లాలో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు, కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.



క్యూలైన్‌లో వేచి ఉన్న సర్వదర్శన భక్తులు

శ్రీవారి సర్వదర్శనానికి 36 గంటలు

తిరుమల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శనివారం నుంచే రద్దీ పెరగ్గా, ఆదివారం కూడా అదే స్థాయిలో భక్తులు కిక్కిరిసి కనిపించారు. సర్వదర్శన భక్తులతో వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ గెస్ట్‌హౌస్ వెనుకభాగంలోని రింగురోడ్డు మీదుగా నందకం వరకు దాదాపు మూడు కిలోమీటర్ల మేరకు వ్యాపించింది. వీరికి 36 గంటల దర్శన సమయం పడుతున్నట్టు టీటీడీ ప్రకటించింది.

టీటీడీ నిత్య అన్నదానానికి రూ.10 లక్షలు విరాళం

తుళ్లూరు, జూన్ 16: తిరుమల తిరుపతి దేవస్థానానికి తుళ్లూరు మండల మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బెజవాడ నరేంద్రబాబు రూ.10 లక్షల విరాళాన్ని అందజేశారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడంతో శనివారం ఆయన కుటుంబ సమేతంగా తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం నిత్య అన్నదాన కార్యక్రమానికి ఆయన రూ.10 లక్షలు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అమరావతి రాజధాని శరవేగంగా చంద్రబాబు నేతృత్వంలో అభివృద్ధి చెందాలని స్వామిని వేడుకున్నట్టు తెలిపారు.




టీటీడీ అధికారులకు రూ.10 లక్షల చెక్కును అందజేస్తున్న నరేంద్రబాబు

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

చెవి అనేది వినడానికి, సమతాస్థితికి ఉపయోగపడే జ్ఞానేంద్రియం. చెవి గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఒటాలజీ అంటారు. మానవుడు 20 హెర్ట్‌జ్‌ల నుంచి 20,000 హెర్ట్‌జ్‌ల వరకు మాత్రమే ధ్వనిని వినగలుగుతాడు. దీనినే శ్రవ్య అవధి అని పిలుస్తారు. 20 హెర్ట్‌జ్‌ల కన్నా తక్కువ పౌనఃపున్యం ఉన్న ధ్వని తరంగాలను పరశ్రావ్యాలు అంటారు. వీటిని ఏనుగులు, గబ్బిలాలు, కుక్కలు వంటి జీవులు వినగలుగుతాయి.

చెవి నిర్మాణం

● బయాలజీ



చెవిలో మూడు భాగాలు ఉంటాయి.
అవి... బాహ్య చెవి, మధ్య చెవి, లోపలి చెవి.

బాహ్య చెవి: దీనిని వెలుపలి చెవి అని కూడా పిలుస్తారు. దీనిలో పిన్నా, బాహ్య శ్రవణ కుహరం, కర్ణభేరి త్వచము అనే మూడు భాగాలుంటాయి. పిన్నాను చెవి దొప్పగా పేర్కొంటారు. ఇది స్థితిస్థాపక మృదులాస్థి నిర్మాణం. బాహ్య శ్రవణ కుహరము ఒక వంపు తిరిగిన నాళంలా ఏర్పడి పిన్నా, కర్ణభేరి త్వచము మధ్య విస్తరించిన నిర్మాణం. చెవి దొప్ప, బాహ్యశ్రవణ కుహర చర్మంలో సున్నిత రోమాలు, మైనం అనేవి ఉంటాయి. చెవిలోకి దుమ్ము, ధూళి ఇతరత్రా రేణువులు ప్రవేశించకుండా రోమాలు, మైనం నిరోధిస్తాయి. కర్ణభేరి త్వచము శంఖువు ఆకారంలో ఉంటుంది. ఈ త్వచము బాహ్య శ్రవణ కుహరాన్ని, మధ్య చెవిని వేరు చేసే పలుచని అర్ధ పారదర్శక పొర. ఈ త్వచం శబ్దతరంగాలను బాహ్య చెవి నుంచి గ్రహించి మధ్య చెవిలోని కూటకానికి అందిస్తుంది.

మధ్య చెవి: మధ్య చెవి అనేది బాహ్య చెవి కర్ణభేరి త్వచానికి, లోపలి చెవి అస్థి విభాజకానికి మధ్యలో విస్తరించి ఉంటుంది. ఇది పుర్రెలోని టెంపోరల్ ఎముకలో ఏర్పడిన గాలితో నిండి ఉంటుంది. మధ్య చెవిలో మాలియస్, ఇంకస్, స్టెపిస్ అనే మూడు అస్థి ఖండాలు ఉంటాయి. మాలియస్‌ని హామర్‌బోన్ అని, ఇంకస్ ని అన్విల్ బోన్ అని, స్టెపిస్‌ని స్టిరప్ బోన్ అని పేర్కొంటారు. ఈ ఎముకలు మూడు గొలుసులుగా ఒకదానితో ఒకటి కలిసి ఉంటాయి. మాలియస్ తలభాగం ఇంకస్‌తో, పరాంతభాగం కర్ణభేరి త్వచంతో కలిసి ఉంటుంది. ఇంకస్ అనేది మధ్య ఎముక. ఇది స్టెపిస్ తలతో కలుపబడి ఉంటుంది. లోపలి చెవి అస్థివిభాజకంలోని అండాకార రంధ్రపు కిటికితో స్టెపిస్ కలుపబడి ఉంటుంది. ఈ మాలియస్, ఇంకస్, స్టెపిస్ మూడు ఎముకలు శబ్ద ప్రకంపనలను లోపలి చెవికి అందజేస్తాయి. మధ్య చెవి కుహరం గ్రసనిని కలుపుతూ యుస్టేషియన్ నాళం ఉంటుంది. ఈ నాళం కర్ణభేరి త్వచానికి ఇరువైపులా వాయు పీడనాన్ని సమానస్థాయిలో ఉంచడానికి తోడ్పడుతుంది.

లోపలి చెవి: వినికిడి ప్రక్రియలో ప్రధాన పాత్రను వహించేది లోపలి చెవి. ఇది ద్రవంతో నిండి ఉన్న కుహరం. దీనిని లాబరింత్ అంటారు. దీనిలో బోని లాబరింత్, మెంబ్రినస్ లాబరింత్ రెండు భాగాలు ఉంటాయి. బోని లాబరింత్‌లో వరుసగా కాక్లియా, వెస్టిబుల్, సెమి సర్క్యులర్ కెనాల్స్ అనే మూడు రకాల కుల్యలు ఉంటాయి.

ఎ.కాక్లియా: దీనినే కర్ణావర్తనం అని కూడా పిలుస్తారు. ఇది సర్పిలాకార నిర్మాణం. కాలా వెస్టిబ్యులి, స్కాలా మీడియా, స్కాలా టింపాని అనే మూడు సమాంతర నాళాలుంటాయి.

బి.వెస్టిబుల్: దీనిలోని ముందు భాగాన్ని సాక్యులస్ అని, వెనుక భాగాన్ని యుట్రిక్యులస్ అని పేర్కొంటారు. సాక్యులస్, యుట్రిక్యులస్ రెండింటిని కలిపి ఆటోలిత్ అంగంగా పిలుస్తారు.

సి. సెమి సర్క్యులర్ కెనాల్స్: ఇవి మూడు ఉంటాయి. ఒకదానికొకటి లంబకోణంలో అమరి ఉంటాయి. వీటి పీఠభాగం ఉబ్బి ఉంటుంది.

వినికిడి ప్రక్రియ

బాహ్య చెవి శబ్ద తరంగాలను గ్రహించి కర్ణభేరి త్వచం మీదకు మళ్లిస్తుంది. ఈ శబ్దతరంగాలకు అనుగుణంగా కర్ణభేరి త్వచం కంపిస్తుంది. ఈ ప్రకంపనలు మూడు ఎముకలైన మాలియస్, ఇంకస్, స్టెపిస్ ద్వారా అండాకార రంధ్రపు కిటికీ వద్దకి చేరి కాక్లియాలోనికి ప్రవేశించి పెరిలింఫ్, ఎండోలింఫ్ ద్రవాలలో అలలను ఉత్పత్తి చేస్తాయి. ఈ అలలు బేసిల్లార్ త్వచంలో ఒక చిన్న అలను కలిగిస్తాయి. ప్రేరణ వల్ల బేసిల్లార్ త్వచంలోని హేర్ సెల్స్ ఒరిగి టెక్టోరియల్ త్వచం మీద ఒత్తిడి కలిగిస్తాయి. అందువల్ల సన్నిహిత అభివాహి నాడీ కణాలలో నాడీ ప్రచోదనం ఏర్పడి శ్రవణ నాడీ ద్వారా మెదడుని చేరుతుంది. అక్కడ నాడీ ప్రచోదనం విశ్లేషించబడి ధ్వని గుర్తించబడుతుంది.

చెవికి సంబంధించిన అపస్థితులు

ఒటిటిస్ మీడియా: ఇది చిన్న పిల్లల్లో సాధారణంగా ఉండే అపస్థితి. మధ్య చెవిలోని యూస్టేసియన్ నాళం పొట్టిగా ఉన్నట్లయితే బ్యాక్టీరియా సంక్రమణకు గురైనప్పుడు చెవిలో చీము అధికంగా వస్తుంది.

టిన్నిటస్: మెదడులో కణితులు ఏర్పడినప్పుడు గాని, అధిక శబ్దాలు విన్నప్పుడు గాని చెవిలో మైనం(సెరుమినస్) అధికంగా ఏర్పడినప్పుడు గాని లోపలి చెవిలో ఉన్న హేర్ సెల్స్ దెబ్బతింటాయి.



కె.నాగశేషులు, సీనియర్ ఫ్యాకల్టీ

దిక్సూచి DIKSUCHI

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

అనాదిగా భారతీయ వంటగదిలోని పోపులపెట్టే చిన్నపాటి ఫస్ట్‌ఎయిడ్ బాక్స్ కాగా, పెరటిలోని అనేక మొక్కలు మందులనిచ్చే కల్పతరువులు. దెబ్బలకు పసుపు, కఫానికి తులసి, దగ్గుకు కరక్కాయ, దంత సంరక్షణకు వేపపుల్ల... ఇలా చెప్పుకొంటూపోతే భారతీయ సాంప్రదాయిక విజ్ఞానం ఒక వైద్యరంగం వద్దే ఆగిపోదు. వ్యవసాయం, పశుపోషణ వంటి అనేక రంగాల్లో మమేకమై కనిపిస్తుంది. అదేవిధంగా భారతదేశ భౌగోళిక, వాతావరణ వైవిధ్యతల దృష్ట్యా జన్యు వనరులపరంగా కూడా దేశం సుసంపన్నం.



'జన్యు వనరులు', 'సాంప్రదాయిక జ్ఞానం'పై

మేధాసంపత్తి ఒప్పందం

అయితే హఠాత్తుగా ఎవరోవచ్చి వీటి వైశిష్ట్యాలను ప్రయోగశాలల్లో తాము నిర్ధారించాము కాబట్టి వీటిపై తమకు యాజమాన్యపు హక్కులున్నాయని అంటే? తరతరాలుగా వస్తున్న సాంప్రదాయిక విజ్ఞానంపై మనకు హక్కు లేకుండా మేధాసంపత్తి హక్కులను వారు దాఖలుపర్చుకుంటే?

నిజానికి గతంలో అదీ జరిగింది. పసుపు, వేప వంటి భారతీయ సాంప్రదాయిక వైద్య విజ్ఞాన అంశాలతోపాటు, నేఫాల్, నేఫాల్-49 గోధుమ రకాలు, బాస్మతి బియ్యం వంటి జన్యు వనరులపై కూడా మేధాసంపత్తి హక్కులను విదేశీ సంస్థలు తీసుకున్నాయి. 1995లో అమెరికా తమ దేశంలోని యూనివర్సిటీ ఆఫ్ మిసిసిప్పీ మెడికల్ సెంటర్ పసుపునకు గాయాలు నయంచేసే గుణం ఉందని ప్రయోగాత్మకంగా రుజువు చేయడంతో పేటెంట్ మంజూరు చేసింది. అయితే ఇండియన్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) అందించిన చారిత్రక ఆధారాలతో తరవాత ఆ పేటెంట్ రద్దయింది.

అదేవిధంగా వేపకాయల నుంచి తీసిన అజాడిరాక్టిన్ ప్రధాన పదార్థంగా తయారుచేసిన ఒక ఔషధంపై 'డబ్ల్యూఆర్ గ్రేస్' అనే కంపెనీకి పేటెంట్ మంజూరైంది. అయితే దీనిపై భారత్ తీవ్రంగా ప్రతిస్పందించడంతో పునఃపరిశీలించి యురోపియన్ పేటెంట్ ఆఫీస్ దానిని రద్దు చేసింది. కానీ యునైటెడ్ స్టేట్స్ పేటెంట్ అండ్ ట్రేడ్‌మార్క్ ఆఫీస్ దానిని రద్దు చేయలేదు.

భారతదేశానికి చెందిన నాప్‌హాల్ గోధుమ రకాలపై 2003లో ఒక యురోపియన్ కంపెనీ బయోపైరసీ(ప్రకృతిసిద్ధ సహజ జన్యు పదార్థాల అక్రమ వినియోగం) చేసి పేటెంట్లు పొందింది. వాస్తవానికి ఇవి సహజ వనరులని, కొత్త ఆవిష్కరణలు కావని భారత అధికారులు సాక్ష్యాలు సమర్పించడంతో పేటెంట్లు రద్దుచేశారు.

ఇదేవిధంగా 2000 సంవత్సరంలో కూడా ఒక అమెరికన్ కంపెనీ బాస్మతి బియ్యంపై పొందిన పేటెంట్‌ను రద్దు చేయించడానికి భారతీయ అధికారులు పెద్ద న్యాయపోరాటమే చేశారు.

ఈవిధంగా ఒక దేశానికి లేదా ప్రాంతానికి చెందిన సాంప్రదాయిక జ్ఞానం, జన్యు వనరులపై వేరొకరు పేటెంట్ పొందడమంటే వారి హక్కులను హరించడమే కాదు, న్యాయంగా వారికి దక్కాల్సిన ప్రయోజనాలు దక్కకుండా పోవడమే. అందుకే ఈ సమస్యను పరిష్కరించడానికి సాంప్రదాయిక, జన్యు వనరులను ఎవరైనా వినియోగిస్తున్నప్పుడు న్యాయబద్ధంగా సంబంధీకులకు దక్కాల్సిన వాటాను అందించడానికి తోడ్పడేలా 2010లో నగోయా ప్రోటోకాల్ తీసుకువచ్చారు. అయితే ఇది అంత సమర్థంగా పనిచేయక పోతుండటంతో మరో కొత్త కట్టుబాటు అవసరమైంది. ఈ నేపథ్యంలో ప్రపంచ మేధాసంపత్తి సంస్థ(వరల్డ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్) ఇటీవల 'ట్రీటీ ఆన్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ(ఐపీ), జెనెటిక్ రిసోర్సెస్ (జీఆర్స్) అండ్ అసోసియేటెడ్ ట్రెడిషనల్ నాలెడ్జ్(ఏటీకే) (మేధా సంపత్తి, జన్యు వనరులు, పారంపర్య సాంప్రదాయిక విజ్ఞాన ఒప్పందం) తీసుకువచ్చారు.

ప్రపంచ మేధోసంపత్తి సంస్థ(డబ్ల్యూఐపీఓ) ప్రధాన కార్యాలయం(జెనీవా)లో 2024 మే 13-24 మధ్య రెండువారాల పాటు, 192 దేశాలు 86 మంది పరిశీలకులు సుదీర్ఘ చర్చలు జరిపిన దరిమిలా మే 24న 'మేధాసంపత్తి, జన్యువనరులు, పారంపర్య సాంప్రదాయిక విజ్ఞాన ఒప్పందం' సాకారమైంది.

మేధాసంపత్తి హక్కు అంటే?

ఒక వ్యక్తి లేదా సంస్థ ఆవిష్కరణలను, ఇతరులు కాపీచేసి వారు అనాయాస లబ్ధి పొందకుండా ఆవిష్కర్తకు ఆ ఆవిష్కరణపై కొంత కాలానికి సర్వహక్కులు కల్పిస్తూ ఇచ్చే చట్టబద్ధమైన హక్కు.

ప్రపంచ మేధాసంపత్తి సంస్థ(డబ్ల్యూఐపీఓ)

- ఇది ఐక్యరాజ్య సమితికి చెందిన ఒక అంగము. స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఉంది.
- దీనిని మేధోసంపత్తి హక్కుల విషయమై అంతర్జాతీయ సహకారం పెంపొందించడానికి 1967లో ఏర్పాటుచేశారు.
- దీనిలో 193 సభ్యదేశాలున్నాయి.
- భారతదేశం 1975లో దీనిలో చేరింది.
- మేధాసంపత్తి హక్కుల విషయమై చర్చలకు ఒక అంతర్జాతీయ వేదికగా, వివాద పరిష్కార కేంద్రంగా పనిచేస్తుంది.
- అంతర్జాతీయ మేధాసంపత్తి ఒప్పందాలను పర్యవేక్షిస్తుంది.
- మేధాసంపత్తి హక్కుల రిజిస్ట్రేషన్ చేస్తుంది.

ఒప్పంద ముఖ్యాంశాలు

1. ఇప్పటివరకూ ఉన్న మేధోసంపత్తి పరిరక్షణ ఒప్పందాలన్నింటిలోనూ సాంప్రదాయిక విజ్ఞానం, జన్యు వనరులపై స్థానికులకు ఉన్న హక్కును గుర్తించిన ఏకైక ఒప్పందం ఇది.

2. ఒక దేశానికి సంబంధించిన సాంప్రదాయిక విజ్ఞానం, జన్యు వనరులను ఇతరులు దోచుకోకుండా, అక్రమంగా వినియోగించుకోకుండా ఈ ఒప్పందం అడ్డుకుంటుంది. దీనిలో ఉన్న 'మాండేటరీ డిస్‌క్లోజర్ ఆబ్లిగేషన్స్' అనే నిబంధన ప్రకారం పేటెంట్ దరఖాస్తుదారు ఏదైనా జన్యువనరులను గానీ, సాంప్రదాయిక విజ్ఞానాన్ని గానీ తమ ఆవిష్కరణలో వినియోగిస్తే అది ఏ దేశానికి చెందిందో, ఆ విజ్ఞానాన్ని పరిరక్షిస్తున్న వారెవరో కూడా స్పష్టంగా వెల్లడించాల్సి ఉంటుంది.

3. ఈ ఒప్పందం ద్వారా జన్యు వనరులు, సాంప్రదాయిక విజ్ఞానం ప్రపంచవ్యాప్తంగా పరిరక్షించేందుకు అన్ని భాగస్వామ్య దేశాలు తమ దేశీయ మేధాసంపత్తి హక్కుల చట్టాల్లో 'డిస్‌క్లోజర్ ఆఫ్ ఆరిజన్'(సదరు జన్యు వనరు/సాంప్రదాయిక విజ్ఞానం ఏ ప్రాంతానికి చెందిందో వెల్లడించే) నిబంధనను చేర్చాల్సి ఉంటుంది.

4. ఈ ఒప్పందం సాంప్రదాయిక విజ్ఞానం, జన్యువనరుల నుంచి నేరుగా సంగ్రహించిన అంశాలకు కాక వాటిని వినియోగించి చేసిన సరికొత్త ఆవిష్కరణలకు మాత్రమే మేధోసంపత్తి హక్కులను అందించడానికి సమ్మతిస్తుంది.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

ఒప్పంద ప్రయోజనాలు

1. సాంప్రదాయిక విజ్ఞానం, జన్యు వనరుల సంవృద్ధి గల భారతదేశం, గ్లోబల్ సౌత్ దేశాల ప్రయోజనాలు, హక్కులు పరిరక్షించగలుగుతారు.

2. బయోపైరసీ ద్వారా ఇతరులు అక్రమ లబ్ధి పొందడాన్ని నివారించి సాంప్రదాయిక విజ్ఞానం, జన్యు వనరుల పరిరక్షణతో సంబంధం గల స్థానిక ప్రజలకు లబ్ధి చేకూరుతుంది.

3. మేధాసంపత్తి హక్కుల పరిరక్షణలో అంతర్జాతీయ ప్రమాణాలు ఏర్పడి, దేశాల మధ్య మేధాసంపత్తి హక్కుల వివాదాలు తగ్గుముఖం పడతాయి. పారదర్శకత పెరుగుతుంది.

4. విజ్ఞాన చౌర్యం, జన్యు వనరుల నకిలీలు తయారు కాకుండా ప్రాచీన విజ్ఞానం, జన్యు వనరుల ఆధారంగా సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించవచ్చు.

అయితే 1999 నుంచి జరిపిన సుదీర్ఘ చర్చల ప్రతిరూపంగా 25 సంవత్సరాల తరవాత సాకారమైన ఈ ఒప్పందం అమలులోకి రావాలంటే కనీసం 15 సభ్యదేశాలు సంతకాలు చేసి, దానిని ర్యాటిఫై (ధృవీకరించాల్సి) ఉంటుంది. అదేవిధంగా ఇది పటిష్టంగా అమలుకావాలంటే అన్ని దేశాలు తమ మేధాసంపత్తి హక్కుల చట్టాలను ఈ ఒప్పందానికి అనుగుణంగా సరిదిద్దాల్సి ఉంటుంది. అయితే ఇప్పటివరకు కేవలం 35 దేశాల్లో మాత్రమే 'డిస్‌క్లోజర్ ఆఫ్ ఆరిజన్' వంటి నిబంధనలు వారి మేధాసంపత్తి హక్కుల చట్టాల్లో చేర్చారు. ఇకముందు ఎన్ని ఎక్కువ దేశాలు ఇలాంటి నిబంధనలను స్వీకరిస్తాయన్న దానిపైనే ఈ ఒప్పంద అమలు ఆధారపడి ఉంటుంది. ఈ ఒప్పందం పటిష్టంగా అమలుకావడమంటే ప్రపంచ జీవవైవిధ్యంలో ఏడు నుంచి ఎనిమిది శాతం వరకు కలిగి ఉన్న, సాంప్రదాయిక విజ్ఞానపరంగా సుసంపన్నమైన భారతదేశానికి శుభపరిణామమే.

వృద్ధులకు వరంగా రూ.4 వేలు పింఛన్

సీతంపేట: వృద్ధులు, వితంతువులకు రూ.4వేల పింఛన్ వరంగా మారిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం సీతంపేటలోని తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీపై మొదటి సంతకం, ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీనిచ్చారని, ఈ మేరకు అధికారంలోకి బాధ్యతలు చేపట్టిన మొదటి రోజే సంతకం చేసి భరోసా కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బి.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థికసాయం

బాడంగి: మండలంలో కోడూరు గ్రామంలో అగ్నిప్రమాదానికి దగ్ధమైన పొందూరు రాముకు చెందిన ఇంటిని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి టీడీపీ వాణిజ్య విభాగం, కోడూరు టీడీపీ సీనియర్ నాయకులు అడ్డా గోవింద ఆదివారం సందర్శించారు. నిరుపేద కుటుంబానికి కొంత ఆర్థికసాయం అందజేశారు. మండల మాజీ ఎంపీపీ బొమ్మినాయని జగన్నాథంనాయుడు, వైస్ ఎంపీపీ సింగి రెడ్డి భాస్కరరావు, ఎంపీటీసీ మరిపి రమేష్‌నాయుడు, సీనియర్ టీడీపీ నాయకులు మరిపి రామారావు, టీడీపీ యూత్ లీడర్ తాడుతూరి గౌరీశంకరరావు, కొల్లి సత్యారావు, కొల్లి జగన్నాథం, ఎల్.సత్యం తదితరులు పాల్గొన్నారు.

మంత్రి, ఎంపీని కలిసిన నాయకులు

తెర్లాం: ఇటీవల నూతనంగా ఎన్నికైన టీడీపీ రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ను జిల్లా బీసీ సాధికార కన్వీనర్ అరసబలగ సర్పంచ్ కోరగంజి సాయిరాం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

శివాలయ వార్షికోత్సవం

వేపాడ: మండలంలోని బానాది గ్రామంలో శివాలయ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, మండల దేశం పార్టీ అధ్యక్షుడు గొంప వెంకటరావు దంపతుల సారథ్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా వేదపండితులు, ఆలయ పురోహితుడు వెంకటరావు దంపతులచే స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేయించారు. సోమవారం ఆలయం ప్రాంగణంలో భారీ ఎత్తున అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు వెంకటరావు తెలిపారు. కార్యక్రమంలో బానాది, ఎం సింగవరం గ్రామాలకు చెందిన వందలాది మంది జనాలు, భక్తులు పాల్గొని పరమశివునికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

శాఖాహారంతో ఆరోగ్యం

శృంగవరపుకోట రూరల్: ప్రతి ఒక్కరూ మాంసాహారం విడనాడి శాఖహారం తినాలని, తద్వారా మీ ఆరోగ్యం శక్తివంతమవుతుందని వినాయక పిరమిడ్ ధ్యాన మండలి సభ్యురాలు జయలక్ష్మి అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని వినాయకపల్లి గ్రామంలో శాఖహార సద్భావన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిరమిడ్ ధ్యానమండలి సభ్యులతోపాటు మీ సర్వీస్ సంఘ సభ్యులు మాట్లాడుతూ శాఖాహారం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు.

పోస్టల్‌శాఖ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించండి

శృంగవరపుకోట రూరల్: పోస్టల్‌శాఖ అందించే పథకాలపై ప్రజలకు సంబంధిత అధికారులు, సిబ్బంది గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని విజయనగరం పోస్టల్‌శాఖ డివిజన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రాజీపేటలో ఉన్న కల్యాణమండపంలో ఆదివారం సంబంధిత శాఖ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పోస్టల్‌శాఖ ఎన్నో మంచి పథకాలు అందిస్తున్నా చాలామందికి ఇంకా చేరువ కావడం లేదని దీనిని మనం అధిగమించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని, శాఖ నిర్దేశించిన లక్ష్యాలను ప్రతి ఒక్కరూ సాధించాలని కోరారు. కార్యక్రమంలో పోస్టల్‌శాఖ ఇన్‌స్పెక్టర్ సతీష్, ఐపీపీబీ మేనేజర్ సతీష్, సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వానికి గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు పూర్తి మద్దతు

రామభద్రపురం: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వానికి గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు పూర్తి మద్దతు తెలుపుతున్నామని జిల్లా పంచాయతీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మజ్జి రాంబాబు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేఖర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీరాజ్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయిపోయిందని, నిధులు లేమితో గ్రామ పంచాయతీల్లో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేకపోయామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి తరుణంలో ఎంతో అనుభవంతులైన ముఖ్యమంత్రి రాష్ట్రానికి సీఎం కావడం ప్రజలు హర్షిస్తున్నారని అన్నారు. చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్రం కొత్త పుంతలు తొక్కి అభివృద్ధి, సంక్షేమం పూర్తిస్థాయిలో జరుగుతుందని అన్నారు. అలాగే నీతి, నిజాయితీకి మారుపేరైన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు పంచాయతీరాజ్ శాఖ అప్పగించడం ఎంతో ముదావహమని అన్నారు. ప్రజా సమస్యలపట్ల అవగాహనా, నిబద్ధత ఉన్న పవన్‌కళ్యాణ్ సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తారని అన్నారు. ఇప్పటికైనా పంచాయతీ వ్యవస్థ గాడిలో పెడతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే త్వరలో పంచాయతీరాజ్ వ్యవస్థకు సంబంధించి ప్రతినిదులంతా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లను కలిసి తమ సమస్యలు వివరిస్తామని తెలిపారు. అలాగే గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం, తాగునీరు, రోడ్లు ఇతర మౌళిక సౌకర్యాలు కల్పించి గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యంవైపు అడుగులు వేస్తారని ఆయన తెలిపారు.

రాష్ట్ర ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారు

- ఎస్.కోట ఎమ్మెల్యే లలిత కుమారి

కొత్తవలస, జూన్ 16: రాష్ట్రప్రజలు కనీవిని ఎరుగని రీతిలో చారిత్రాత్మకమైన తీర్పును ఇచ్చారని శృంగవరపుకోట శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి అన్నారు. ఆదివారం మండలంలోని కంటకాపల్లి గ్రామంలో గ్రామానికి చెందిన తూరిబిల్లి ఆనంద్ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోనే కాకుండా శృంగవరపుకోట నియోజకవర్గ ప్రజలు విచక్షణతో ఓట్లు వేసి తనకు భారీ మెజార్టీని అందించారన్నారు. రాష్ట్రంలో జరిగే విధ్వంస పాలనను ఎవరూ చూడలేదనుకుని భావించారని, జరిగే ప్రతి ఘటనను పరిశీలించి ఓటు అనే ఆయుధంతో తీర్పు ఇచ్చి ఇంటికి పంపించారన్నారు. రాష్ట్రంలో ఈ ఐదేళ్లలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని, దీని వల్ల అభివృద్ధి 20 సంవత్సరాల వెనక్కు వెళ్లిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీ మంత్రి లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతుందన్నారు. శృంగవరపుకోట నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గొరపల్లి రాయు, కోళ్ల వెంకటరమణ, పీవీ రత్నాజీ, మొబ్బిలి రమణ, గొంపదుర్గా ఉమేష్, మిడతాన కాశీ, నక్కరాజు చినరాము, సాగర్ కళ్యాణ్, రాంబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోళ్ల లలిత కుమారి

జిల్లా అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దాం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



సెర్ప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీకేక్ కట్ చేస్తున్న మంత్రి కొండపల్లి

విజయనగరం (ఆంధ్రజ్యోతి), జూన్ 16: జిల్లా అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా కలిసికట్టుగా పనిచేద్దామని రాష్ట్ర సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ సంబంధాల శాఖామాత్యులు కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మంత్రి హోదాలో ఆదివారం తొలిసారి జిల్లాకు వచ్చిన ఆయనను జడ్పీ అతిథి గృహంలో కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ కార్తీక్, డీఆర్వో అనిత, ఆర్డీవో సూర్యకళ, డిఆర్‌డిఎ పీడి కల్యాణ చక్రవర్తి తదితర జిల్లా అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందచేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి ఆయన మాటాడారు. అనంతరం సెర్ప్, డిఆర్‌డిఎ పీడి కళ్యాణ చక్రవర్తి, అధికారులు, సిబ్బంది ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. డీఆర్‌డీఏ శాఖ ఏర్పాటు చేసిన భారీకేక్‌ను కట్‌చేసి ఉద్యోగులు, సిబ్బందికి అందచేశారు.

పైడిమాంబను దర్శించుకున్న మంత్రి

విజయనగరం రూరల్: రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం విజయనగరంలోని మూడు లాంతర్లు వద్ద ఉన్న పైడిమాంబ చదురుగుడిలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈయనకు ఆలయ ఈవో ప్రసాదరావు, ఆలయ అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అధికారులు, నాయకులు తదితరులు ఆలయం వద్దకు వచ్చి మంత్రి శ్రీనివాస్‌ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ● మంత్రిగా బాధ్యతలు స్వీకరించి, తొలిసారిగా విజయనగరం వచ్చిన కొండపల్లి శ్రీనివాస్‌ని రాజాపులోవ జంక్షన్ వద్ద నెల్లిమర్ల నియోజకవర్గ నాయకులు కర్రోతు బంగార్రాజు, సువ్వాడ రవిశేఖర్, కంది చంద్రశేఖర్, పతివాడ అప్పలనారాయణ, ఆకిరి ప్రసాదరావు, కర్రోతు సత్యనారాయణ, పల్లె భాస్కరరావు, పతివాడ తమ్మినాయుడు, మహంతి శంకరరావు, కడగల ఆనందకుమార్, గేదెల రాజారావు, అవనాపు సత్యనారాయణ మంత్రి శ్రీనివాస్‌కు స్వాగతం పలికి, పుష్పగుచ్ఛాలు అందించారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే కోళ్ల

శృంగవరపుకోట: మంత్రిగా విజయనగరం వచ్చిన గజపతినగరం ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్‌ను శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ రాంప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. వీరితో పాటు నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

విజయనగరం దాసన్నపేట, జూన్ 16: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న శానిటేషన్ కార్మికుల మూడు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు ఎ.జగన్మోహన్ కార్మికుల యూనియన్ ప్రతినిధి నందిని కోరారు. ఆదివారం నగరంలోని కస్పా హైస్కూల్లో యూనియన్ ప్రతినిధి ఎస్‌కే బేగం అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జగన్మోహన్ మాట్లాడుతూ, నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఆయాలకు రెమ్యూనరేషన్ ఇవ్వాలని, పార్ట్‌టైం వర్కర్స్ అని చెప్పి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ పనిచేస్తున్నారని ఈ నేపథ్యంలో నెల వేతనం రూ. 6 వేలు సరిపోదని, కనీసం రూ. 12 వేలు ఇవ్వాలన్నారు. నిర్దిష్టమైన పని గంటలు ప్రకటించాలని కోరారు. పై సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20న మండల విద్యాశాఖాధికారిని కలుస్తామన్నారు. సమావేశంలో యూనియన్ ప్రతినిధులు పార్వతీ, సత్యవతి, ఉమా, చినతల్లి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

సాలూరు రూరల్, జూన్ 16: సాలూరులో వేంచేసి ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి పంచదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి శ్రీవారికి ప్రత్యేక పూజలను రుత్వికులు నారాయణాచార్యులు, ఉదయాచార్యులు, పార్థసారథి, హరివల్లాభాచార్యులు తదితరులు నిర్వహించారు. రుత్వికులు ఆధ్వర్యంలో రాత్రి ఉభయదేవేరులతో కలసి సాలూరులో శేషవాహనంపై కల్యాణ వేంకటేశ్వరస్వామి వైభవంగా తిరువీధి చేశారు. తిరువీధిలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వంగపండు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సాలూరులో ఉభయ దేవేరులతో ఊరేగుతున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి

మంత్రి సంధ్యారాణికి అభినందనలు

విజయనగరం దాసన్నపేట, జూన్ 16: రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఆదివారం సాలూరులోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ కోసం కమిషన్ చేపడుతున్న కార్యక్రమాల గురించి చర్చించారు. బాలల హక్కుల ఉల్లంఘనలు జరగకుండా బాలల కోసం రూపొందించిన చట్టాలను కఠినంగా అమలు చేయాలని మంత్రి సంధ్యారాణి సూచించారు.



మంత్రిని కలిసిన కేసలి అప్పారావు

పచ్చదనంతోనే ఆరోగ్యం

శృంగవరపుకోట: మండల కేంద్రమైన శృంగవరపుకోటలో జియో స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బొబ్బిలి రామకృష్ణ, విజయలక్ష్మి ఫాదర్స్‌డే సందర్భంగా ఆదివారం తమ కుటుంబ సభ్యులతో మొక్కలు నాటారు. భూమిపైన జీవరాశికీ రక్షణ ఇచ్చేవి చెట్లు అని ప్రతిఒక్కరూ పదిమొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో వి.నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే కోండ్రుకు శుభాకాంక్షలు



కోండ్రును కలిసిన మత్స్యకారుల సంఘం

రాజాం, జూన్ 16: ఎమ్మెల్యేగా గెలుపొందిన కోండ్రు మురళీమోహన్‌ను మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు బెహరా తవుడు ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయకు బొకే అందించి దుశ్శాలువతో సత్కరించారు. మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళి పరిష్కరించేలా తనవంతు కృషి చేస్తానన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం మత్స్యకారులకు రాయితీపై అన్ని రకాల పరికరాలు అందించేందని మరలా అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తనదృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గృహ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావాలి

విజయనగరం దాసన్నపేట, జూన్ 16: గృహ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావాలని డీబీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం కణపాక యూత్ హాస్టల్‌లో ఇంటర్నేషనల్ డొమెస్టిక్ వర్కర్స్ డే సందర్భంగా జిల్లా కో-ఆర్డినేటర్ కె.వరలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిట్టిబాబు హాజరై మాట్లాడుతూ, అసంఘటిత రంగంలో అత్యధికంగా ఉన్న గృహకార్మికులకు సమగ్ర చట్టం రూపొందించాలన్నారు. అధిక శాతం మహిళలు డొమెస్టిక్ వర్కర్స్‌గా ఉన్నారన్నారు. వీరి సేవల ద్వారా మధ్యతరగతి ప్రజలు ప్రశాంతంగా ఉద్యోగాలు చేసుకోగలుగుతున్నారన్నారు. ప్రభుత్వం గృహకార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని ఈఎస్‌ఐ వంటి సౌకర్యాలు, ఇతర కార్మికుల మాదిరిగా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టరు ఖలివేల ఎలిషాకుమార్, జామి దేవి, పార్వతీ, జ్యోతి, ఆసీనాబేగం తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న చిట్టిబాబు

అధికారులు తీరు మార్చుకోవాలి

- వాడీవేడిగా జామి మండల సర్వసభ్య సమావేశం
- అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల మండిపాటు

జామి, జూన్ 16: అధికారులు తమ తీర్చుకోవాలని మండల సభ్యులు సూచించారు. ఆదివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై మండలంలో జరుగుతున్న పలు అక్రమాలపై సభ్యులు నిలదీశారు. ఎంపీపీ సబ్బవరపు అరుణ ఆధ్వర్యంలో ఉదయం పదిగంటలకు మొదలైన సమావేశానికి ప్రజాప్రతినిధులు వచ్చినప్పటికీ అధికారులు ఆలస్యంగా వచ్చారు. దీనిపై ఎంపీడీవో తిరుమలరావు మాట్లాడుతూ అధికారులు సమయపాలన పాటించకపోతే చర్యలు తీసుకోకతప్పదన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో పలు పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండల విద్యాశాఖాదికారి వైఖరిపై మండిపడ్డారు. జామి మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటైనా దీనిని విజయవంతం చేసేందుకు అందరి సహకారం లేకుండా సమావేశాలు ప్రజాప్రతినిధులతో కాకుండా వివిధ పార్టీల నాయకులతో నిర్వహిస్తున్నారని ఇది సరికాదన్నారు. దీనిపై ఏంఈవో జయశ్రీ మాట్లాడుతూ జామి కళాశాల సమావేశం గురించి తనకు తెలియదన్నారు. అదేవిధంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ మండలంలో అనుమతులు లేకుండా నడుపుతున్న పాఠశాలలు, కళాశాలలను మూయించాలని కోరారు. మండలంలో పలు పంచాయతీల్లో జరుగుతున్న విత్తనాల పంపిణీ గురించి సంబంధిత అధికారులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు చెప్పకపోవడం బాధాకరమని, వారి నిరంకుశ వైఖరి మార్చుకోవాలన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో విత్తనాల పంపిణీని పోలీసు బందోబస్తు మధ్య ఇవ్వడం మరీ విడ్డూరంగా ఉందన్నారు. ఇదేవిషయంపై చింతాడ సర్పంచ్ సుబ్రహ్మణ్యం, పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ ఈశ్వరరావు మధ్య స్వల్ప వివాదం జరిగింది. దీనిపై ఎంపీడీవో స్పందించి అధికారులు ప్రోటోకాల్ పాటించాలని ఆదేశించారు. మండలంలోని భీమసింగి ఎంపీటీసీ సత్యవతి మాట్లాడుతూ తమ గ్రామంలో అక్రమంగా మట్టితవ్వకాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు, సిబ్బంది పట్టించుకోకుండా వ్యవహరించడం బాగోలేదన్నారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ రాంబాయ్ వీటిపై వీఆర్‌వోతో విచారణ జరిపిస్తామన్నారు. జన్నివలస సర్పంచ్ చంద్రునాయుడు మాట్లాడుతూ హైవే పనుల వల్ల రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నా అధికారుల్లో చలనం లేదని ఆరోపించారు. అయితే ఇంత ముఖ్యమైన సమావేశంలో జామి హైవే నిర్మాణం వల్ల శ్మశానం స్థలం హైవేలో కలిసిపోయింది. గడిచిన రెండేళ్లుగా శ్మశానం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మండల కేంద్రంలో ఉన్న ఎంపీటీసీలు, ప్రజాప్రతినిదులెవ్వరూ నోరుమెదపకపోవడం విశేషం. అధికారులు, జడ్పీటీసీ గొర్లె సరయూ, వైస్ ఎంపీపీ విజయలక్ష్మి, లగుడు వెంకటరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.



జామి జూనియర్ కళాశాలపై ఏంఈవోను ప్రశ్నిస్తున్న చింతాడ సర్పంచ్ సుబ్రహ్మణ్యం

రెండు నెలల తరువాత..

- లభ్యమైన మత్స్యసంపద
- ఆనందంలో గంగపుత్రులు



వేటనుంచి చేపలు తీసుకొస్తున్న మత్స్యకారులు

భోగాపురం, జూన్ 16: గత రెండు నెలలుగా సముద్రంలో వేటకు దూరమయ్యారు మత్స్యకారులు. ఎట్టకేలకు నిషేద ఆజ్ఞలు తొలగిపోవడంతో వారు సముద్రంలో వేట ప్రారంభించారు. మత్స్యసంపద లభ్యం కావడంతో మత్స్యకారులు ఆది వారం ఆనందంగా కనిపించారు. ఏప్రిల్ 15 నుంచి ఈ నెల 14 వరకు సముద్రంలో చేపల వేటను అధికారులు నిషేదించారు. దీంతో మత్స్యకారులు గత 61 రోజుల పాటు వేటకు దూరంగా ఇంటి పట్టునే ఖాళీగా ఉన్నారు. నిషేద ఆజ్ఞలు ఎప్పుడు తొలగిపోతాయా అని ఎదురుచూశారు. ఎట్టకేలకు నిషేద ఆజ్ఞలు తొలగి పోవడంతో మత్స్యకారులు సముద్రంపైకి ఉషారుగా వెళ్లి వేట సాగించారు. గత రెండు నెలలుగా బోసిపోయిన ముక్కాం, కొండ్రాజుపాలెం, చేపలకంచేరు తీర ప్రాంతాలు ఆదివారం మత్స్యకారులు, కొనుగోలుదారులతో కళకళలాడాయి.

రోడ్డు ప్రమాదంలో హెల్త్ ఉద్యోగి మృతి



ఆదినారాయణ (ఫైల్)

సాలూరు రూరల్, జూన్ 16: మండలంలో చీపురువలస వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గురువునాయుడుపేట పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రొంపల్లి ఆదినారాయణ (41) మృతి చెందినట్టు సాలూరు రూరల్ ఏఎస్‌ఐ శ్రీరాములు తెలిపారు. సాలూరు మండలం అన్నంరాజువలస పంచాయతీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన రొంపల్లి ఆదినారాయణ తాడికొండ పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల ఆయన పాచిపెంట మండలం గురువునాయుడుపేట పీహెచ్‌సీకి డెప్యూటేషన్‌పై వచ్చారు. ఆయన శనివారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా చీపురువలస వద్ద లారీ ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన్ను స్థానికులు తొలుత మామిడిపల్లి పీహెచ్‌సీకి, తదుపరి సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం విజయనగరంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మరణించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ శ్రీరాములు తెలిపారు. మృతునికి భార్య, పాప, బాబు ఉన్నారు.

గంజాయి పట్టివేత

రామభద్రపురం: మండల కేంద్రంలో గాంధీ బొమ్మ జంక్షన్ వద్ద గంజాయితో సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ జ్ఞాన ప్రసాద్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కృష్ణా జిల్లా నాగాయలంకకు చెందిన పెనమల పూర్ణ కిషోర్, విజయవాడ సిటీ రామవరప్పాడుకు చెందిన చీపురుపల్లి ప్రేమ్‌కుమార్ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నం చేయగా వెంబడించి వారిని సోదా చెయ్యగా వారి వద్ద 1.2 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. దీని విలువ సుమారు రూ.3వేలు ఉంటుందన్నారు. దీనిని వారు ఒడిశా రాష్ట్రం కోరాపుట్ పరిసర ప్రాంతాల్లో కొనుగోలు చేసి విజయవాడకు తీసుకువెళుతున్నట్లు తెలిపారన్నారు. ఈ కేసు విషయమై ఉప తహసీల్దార్, మరో మధ్యవర్తి సమక్షంలో వాంగ్మూలం రికార్డు చేసి గంజాయిని సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసి, బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాటిపూడిలో పడి వ్యక్తి మృతి

గంట్యాడ: తాటిపూడి రిజర్వాయర్లో కాలు జారి పడిపోవడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి గంట్యాడ ఎస్‌ఐ సురేంద్ర నాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చోడవరం గ్రామానికి చెందిన నాగేశ్వరరావు(45) ఎస్‌కోటలోని తన అత్తవారింటికి ఈ నెల 14న వచ్చాడు. అక్కడి నుంచి తాటిపూడిని చూసేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ప్రాజెక్టు పైకి వెళ్లి గట్టుమీదకు నిల్చొని చూస్తుండగా అక్కడి నుంచి పొరపాటున కాలు జారి రిజర్వాయర్‌లోకి పడిపోయాడు. ఆదివారం ఉదయం రిజర్వాయర్‌లో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఆటోలు ఢీ.. వృద్ధురాలి మృతి

కొత్తవలస, జూన్ 16: కొత్తవలస పంచాయతీ అడ్డూరివానిపాలె గ్రామం సమీపంలో శనివారం రాత్రి ఎదురెదురుగా వెళుతున్న రెండు ఆటోలు ఢీకొన్న ఘటనలో వృద్ధురాలు మృతి చెందగా మరో నలగురికి తీవ్రగాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి కొత్తవలస సీఐ వి.చంద్రశేఖరరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తవలస నుంచి శృంగవరపుకోట వెళుతున్న ఆటో, శృంగవరపుకోట వైపు నుంచి కొత్తవలస వస్తున్న ఆటో శనివారం రాత్రి ఎదురెదురుగా ఢీకొన్నాయి. లక్కవరపుకోట మండలం, మల్లివీడు గ్రామానికి చెందిన లెంక జయమ్మ(60) తీవ్రగాయమై చికిత్స కోసం విశాఖపట్టణం తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. ఇదే ప్రమాదంలో పెదిరెడ్డిలక్ష్మి, పి.నిర్మల, కర్రి సత్యనారాయణ, కర్రి మంగమ్మ తీవ్రంగా గాయపడ్డంతో వీరిని విశాఖపట్టణం కేజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్లపై కేసునమోదు చేసినట్టు సీఐ తెలిపారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టెం నిమిత్తం తరలించినట్టు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు.

ఆర్‌ఎంపీలతో సమావేశం

రాజాం, జూన్ 16: ఆసుపత్రిలో పసిపిల్లలకు సంబంధించి ఇంక్యుబేటర్, అడ్వాన్స్‌డ్ వెంటిలేటర్, పీడియాట్రిక్ సర్జరీ వంటి కార్పొరేట్ స్థాయి సౌకర్యం అతి తక్కువ ధరకు అందుబాటులోకి తీసుకు వచ్చామని డాక్టర్ అన్వేష్, గైనికాలజిస్ట్ వసంత తెలిపారు. ఆదివారం స్థానిక వెంకటేశ్వర కల్యాణ మండపంలో ఆర్‌ఎంపీ వైద్యులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 24 గంటలు స్కానింగ్ సౌకర్యం అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి సురక్షితంగా తీసుకురావడానికి వాహన సదుపాయం కల్పించామన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఆర్ట్స్, క్రాఫ్ట్ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

పార్వతీపురంటౌన్: ఈ ఏడాది జరిగే మెగా డీఎస్సీలో ఆర్ట్స్, క్రాఫ్ట్ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఉత్తరాంధ్ర నిరుద్యోగ ఉపాధ్యాయ సంఘం నాయకుడు కె.సత్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో ఆ సంఘ సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. మెగా డీఎస్సీని ప్రకటించడం సంతోషదాయకమే గానీ, ఆర్ట్స్, క్రాఫ్ట్ ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి ఖాళీలను చూపించకపోవడం బాధాకరం అన్నారు. నూతన విద్యా విధానం ప్రకారం వర్క్ ఎడ్యుకేషన్, క్రియేటివిటీ ఎడ్యుకేషన్ 4వ ప్రధాన అంశంగా ఉన్నప్పటికీ ఆర్ట్స్, క్రాఫ్ట్ ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం విస్మరించడం సరికాదని, రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు లక్షమంది ఆర్ట్స్, క్రాఫ్ట్ ఉపాధ్యాయులు డిఎస్సీ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. గత 30 ఏళ్లగా జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్ట్స్, క్రాఫ్ట్ ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టలేదని, 2018 డిఎస్సీలో మాత్రమే గిరిజన, బీసీ వేల్ఫేర్ పాఠశాలల్లో ఖాళీను అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో భర్తీ చేశారని చెప్పారు. తమ ఉపాధ్యాయులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

మూడేళ్లు ఏం చేశారో?

● ఇప్పటికీ పూర్తికాని మామిడిపల్లి పీహెచ్‌సీ భవన నిర్మాణం



అసంపూర్తిగా ఉన్న మామిడిపల్లి పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణం

సాలూరు రూరల్: మామిడిపల్లి పీహెచ్‌సీ నూతన భవనం పనులు ప్రారంభించి మూడేళ్లు గడిచినా పూర్తి కాలేదు. గత ప్రభుత్వం ఈ నిర్మాణ విషయమై తాత్సారం చేసింది. విచిత్రం ఏమిటంటే శిలాఫలకంలో ఉన్న వారి పదవులు మారాయి. అయినా భవన నిర్మాణం పూర్తి కాకపోవడం విశేషం. మామిడిపల్లి పీహెచ్‌సీ ప్రస్తుతం భవనం సువర్ణముఖి నది ఒడ్డున ఉంది. హుదూద్, గులాబ్ తుఫాన్ సమయంలో పీహెచ్‌సీ మునిగిపోయింది. ఈ సమస్యను తీర్చడానికి పీహెచ్‌సీలకు నాడు-నేడు పథకంలో గత ప్రభుత్వం రూ.1.81 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ భవన పనులకు సెప్టెంబరు 26, 2020లో అప్పటి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పుష్పశ్రీవాణి శంకుస్థాపన చేశారు. ఆమె ఆ పదవిలో 2022 ఏప్రిల్ 10 వరకు ఉన్నారు. ఆ సమయానికి సాలూరు ఎమ్మెల్యేగా పీడిక రాజన్నదొర, ఎమ్మెల్సీగా గుమ్మిడి సంధ్యారాణి ఉన్నారు. పుష్పశ్రీవాణి ఉపముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఈ భవన నిర్మాణం పూర్తి కాలేదు. తదుపరి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖా మంత్రిగా పీడిక రాజన్నదొర నియమితులయ్యారు. ఆ హోదాలో ఈ భవనం ప్రారంభిస్తారేమోనని ఈ ప్రాంతవాసులు ఆశించారు. బిల్లుల చెల్లింపులో జాప్యం వల్ల భవన నిర్మాణం పూర్తి కాలేదు. వైసీపీ ప్రభుత్వం మారిపోయింది. శిలాఫలకంలో పేర్లు ఉన్న పీడిక రాజన్నదొర, పుష్పశ్రీ వాణి ఓటమి చెందారు. అలాగే శిలాఫలకంలో పేర్లు మరికొందరు ప్రముఖులు సైతం ఈ ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. అప్పట్లో ఎమ్మెల్సీగా ఉన్న గుమ్మిడి సంధ్యారాణి ప్రస్తుతం సాలూరు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆమె చొరవ తీసుకొని భవనం నిర్మాణం పూర్తి చేయించి ప్రారంభించాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

గిరిజన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలి



చినమేరంగి సీహెచ్‌సీలో రోగులను పరామర్శిస్తున్న గంగునాయుడు

జియ్యమ్మవలస: మండలంలోని గిరిజన ప్రాంతాల్లో మలేరియా విజృంభిస్తోందని, వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన చినమేరంగి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్య చికిత్సలు పొందుతున్న మలేరియా జ్వర పీడితులను పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చినమేరంగి సీహెచ్‌సీలో 30 పడకలు ఉంటే సుమారు 40 మంది రోగులు ఉన్నారని, మంచానికి ఇద్దరేసి చొప్పున చికిత్స పొందుతున్నారని చెప్పారు. వైద్య సిబ్బంది సేవలు అందిస్తున్నప్పటికీ సిబ్బంది కొరత స్పష్టంగా కనిపిస్తోందన్నారు. మందులు, ఇంజక్షన్లు అందుబాటులో ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు. సీహెచ్‌సీలో అర్నాడ, వనజ, కొత్తవలస, కొత్తగూడ, చినదోడిజ గిరిజన గ్రామాలకు చెందిన ప్రజలు వైద్య చికిత్సలు పొందుతున్నారని తెలిపారు. జ్వరాలపై కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బి.మోహనరావు పాల్గొన్నారు.

సవరభాష వలంటీర్ల రెన్యువల్‌కు సహకరించండి

సీతంపేట: ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న సవరభాష వలంటీర్లు రెన్యూవల్‌కు సహకరించాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.డుంబు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. 2024-25 విద్యా సంవత్సరానికి రెన్యువల్ అయ్యే విధంగా సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, ప్రతి ఏడాది పాఠశాలల పునః ప్రారంభం జూన్ 12 నాటికి రెన్యువల్ ఆర్డర్ కల్పించాలని కోరామని చెప్పారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎస్.ఆనందరావు, సెక్రటరీ ఎస్.మాసయ్య తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవల్లో ఆదర్శంగా నిలవాలి

పార్వతీపురంటౌన్: సామాజిక సేవల్లో ఆదర్శంగా నిలవాలని పార్వతీపురం నియోజకవర్గ ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఆదివారం పట్టణంలోని లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పార్వతీపురం మన్యం జిల్లాలోనే సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందున్న లయన్స్ క్లబ్ సభ్యులకు అభినందనలు తెలిపారు. భవిష్యత్ లయన్స్ సేవలను విస్తృతం చేసి పేదలకు అండగా నిలవాలన్నారు. అంతే కాకుండా సేవా కార్యక్రమాల్లో తన వంతు సహాయ సహకారాలు సంపూర్ణంగా ఉంటాయని చెప్పారు. అనంతరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా బి.నాగభూషణరావు, కార్యదర్శిగా పి.వెంకటప్రసాద్, కోశాధికారిగా టీవీఎస్ నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు.

పరిశుభ్రతపై దృష్టి సారించండి



గరుగుబిల్లిలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న అర్జునరావు

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలో పరిశుభ్రతపై సిబ్బంది దృష్టి సారించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.అర్జునరావు సూచించారు. మండలంలోని గరుగుబిల్లి, పెద్దూరు, రావుపల్లిలో పారిశుధ్య నిర్వహణ పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశాల మేరకు 25 పంచాయతీల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వర్షా కాలం దృష్ట్యా అంటువ్యాధులు ప్రబలకుండా కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రహదారికి ఆనుకుని ఉన్న దుకాణదారులు వ్యర్థాలను రహదారులపై వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తాగునీటి వనరుల ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలందించాలని ఆయన ఆదేశించారు. విధుల నిర్వహణపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పరిశీలనలో కార్యదర్శులు డి.జగదీష్, సాయికుమార్, వైద్య సిబ్బంది ఉన్నారు.

వరి విత్తనాల పంపిణీ



వరి విత్తనాలను అందజేస్తున్న దృశ్యం

చీపురుపల్లి: మండలంలోని కర్లాం రైతు భరోసా కేంద్రంలో ఆదివారం వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో వ్యవసాయానికి పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాయితీపై అందజేస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రౌతు కామునాయుడు, కెల్ల రామారావు, బాణాన రామకృష్ణంనాయుడు, దన్నాన రామచంద్రుడు, ముల్లు రమణ, దన్నాన పురుషోత్తంనాయుడు, దన్నాన సూరపునాయుడు, గడే సన్యాసప్పలనాయుడు, ఆరతి సాహు, జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గజపతినగరంలో..

గజపతినగరం: స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో సోమవారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేతులమీదుగా వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తామని ఏడీఏ కె.మహరాజన్ తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ, జామి మండలాల్లో 23వేల 264హెక్టార్లలో వరి సాగు చేస్తున్నట్టు చెప్పారు. ఈ మేరకు 13,645 క్వింటాల వరి విత్తనాలను ఆర్బీకేల ద్వారా రైతులకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రైతులు విత్తనాల పంపిణీ కార్యక్రమానికి అధిక సంఖ్యలో రావాలని ఆయన కోరారు.

జనసేనలో చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న శ్రీనివాసరావు

చీపురుపల్లి: పెదనడిపల్లి గ్రామానికి చెందిన సుమారు 70 కుటుంబాలు వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరినట్టు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విసిసిని శ్రీనివాసరావు తెలిపారు. గ్రామంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో గడిదాసు దాలప్పడు, కోరాడ చక్రవర్తి, సాయి, మోహన్, దుర్గాప్రసాద్, కురమాన అప్పన్న, బొడ్డు సాయి, బొట్ట దుర్గాప్రసాద్, పసుపురెడ్డి నరేష్, మామిడి సురేష్, శంకర్, గుర్రప్ప, కార్తీక్ తదితరులు వారి కుటుంబాలతో చేరినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రచార కమిటీ కోఆర్డినేటర్ కోట్ల కృష్ణ, వై. లక్ష్మునాయుడు, గంట్యాడ భాస్కరరావు తదతరులు పాల్గొన్నారని శ్రీనివాసరావు తెలిపారు.

బీజేపీలోకి పలువురు..

నెల్లిమర్ల: నెలిమర్లకు చెందిన పలువురు కార్యకర్తలు ఆదివారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. నెల్లిమర్లలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శిరపూరి రమేష్ తోపాటు పలువురు పార్టీలో చేరారు. బీజేపీ నియోజకవర్గ స్థాయి నాయకుడు బూర్లె శ్రీధర్ వీరందరికీ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ నాయకులు రాజేష్, కళావతి తదితరులు పాల్గొన్నారు.

జయకృష్ణ విజయోత్సవ ర్యాలీ



భామినిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జయకృష్ణ

భామిని: మండలంలోని నేరడి, భామిని, లివిరి గ్రామాల్లో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ విజయోత్సవ ర్యాలీ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భామినిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తూ ప్రజలు వైసీపీ ప్రభుత్వానికి బుద్ధిచెప్పి ఎన్‌డీఏ ప్రభుత్వానికి గెలిపించారన్నారు. రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ నిరంతరం శ్రమిస్తున్నారని, తన వంతుగా నియోజకవర్గానికి అభివృద్ధి కోసం కృషి చేస్తానని, ఇది ప్రజల విజయంగానే భావిస్తున్నానని జయకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తోటపల్లి ప్రాజెక్టు మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగారావు, జగదీశ్వరరావు, రవినాయుడు, సర్పంచ్ నేతింటి రాజేశ్వరితో పాటు జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యం

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర ● పలువురి అభినందన



విజయచంద్రను అభినందిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురం నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో గెలిచిన ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను నియోజకవర్గ పరిధిలో ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అదే విధంగా వివిధ శాఖల అధికారులు, వీఆర్వోల సంఘ నాయకులు, గ్రామ కార్యదర్శుల సంఘాల నాయకులు ఆదివారం అభినందించారు. ఈసందర్భంగా విజయచంద్ర మాట్లాడుతూ తన విజయం కోసం కష్టపడిన కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బార్నాల సీతారాం, బోను దేవిచంద్రమౌళి, గొట్టాపు వెంకటనాయుడు, రౌతు వేణు, కందకూరి ప్రభాకరరావు, జి.రవికుమార్, పాలకొండ రాజశేఖర్, మండల ఫకీరు, మండల తాతబాబు, జనసేన నాయకుడు చందక అనీల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇష్టమైన విత్తనాలే ఇవ్వండి

● ఏపీ సీడ్స్ అధికారులకు రాష్ట్రమంత్రి సంధ్యారాణి ఆదేశం

సాలూరు రూరల్: రైతులు ఏ రకం వరి సాగు చేయడానికి మొగ్గు చూపుతారో వాటిని సరఫరా చేసి ఎంవోయూ తీసుకోవాలని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఏపీ సీడ్స్ అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశించారు. ఏపీ సీడ్స్ అధికారులు ఎంవోయూ పద్ధతిలో అధికంగా ఆర్జీఎల్ రకం వరి విత్తనాలు ఇస్తామని, 1064 తక్కువ మొత్తంలో ఇస్తామని రైతులకు చెప్పడంతో వారు ఆదివారం ఆమెకు సమస్యను వివరించారు. సాలూరు ప్రాంతంలో 1064 రకం వరి సాగుకే ఎక్కువ మంది రైతులు మొగ్గు చూపుతున్నారని రైతుల పక్షాన మాజీ ఏఎంసీ అధ్యక్షుడు కేతిరెడ్డి చంద్రశేఖర్ ఆమెకు వివరించా రు. వరి రకాలు, సాగు తదితర వాటికి వివరించారు. ఈ మేరకు ఆమె ఏపీ సీడ్స్ మార్కెటింగ్ రాష్ట్ర అధికారి జలంధర్‌కు ఫోన్ చేశారు. రైతులు కోరిన వరి రకం సాగును ప్రోత్సహించాలన్నారు. ఆర్జీఎల్‌తో పాటు 1064 రకం వరి సైతం సాగు ప్రోత్సాహించాలని ఆదేశించారు. దీంతో రైతులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ● అనంతరం ఆమె విలేకర్లతో మాట్లా డుతూ ఫీడర్ అంబులెన్స్ డ్రైవర్లను తొలగించబోమని, మన్యంలోని వారి సేవలను కొనసాగిస్తామని తెలిపారు. కాంట్రాక్టు ట్రైబుల్ టీచర్ల సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

తమకు ఉద్యోగ భద్రతను కల్పించాలని రాష్ట్ర మంత్రి సంధ్యారాణికి సాలూరు సర్కిల్ ప్రభుత్వ మద్యం షాపుల సూపర్‌వైజర్లు, సేల్స్‌మేన్లు ఆదివారం వినతిపత్రం అందించారు. తాము కాంట్రాక్ట్ పద్ధతిలో మద్యం షాపుల్లో పనిచేస్తున్నామని, తమను కొనసాగించేలా సీఎం చంద్రబాబు దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లాలని వారు కోరారు.

మంత్రికి అభినందనల వెల్లువ



మంత్రి సంధ్యారాణికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఐటీడీఏ పీవో విష్ణుచరణ్

సాలూరు రూరల్: రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి ఆదివారం సాలూరులోని తన నివాసం వద్ద పలువురు అభినందనలు తెలిపారు. బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, పార్వతీపురం ఐటీడీఏ పీవో సి.విష్ణుచరణ్, ఎంఈవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం, జిల్లా అధ్యక్షుడు పల్లి జోగారావు, ఆప్టా, పీఆర్టీయూ నాయకులు గణపతి, గున్నరాజు, అధికారులు పెద్దసంఖ్యలో వచ్చి అభినందనలు తెలిపారు. ● జీవో నెంబరు 117 రద్దు చేయించడానికి కృషి చేయాలని మంత్రి సంధ్యారాణిని ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు అల్లాడి గణపతి కోరారు. ఆయనతో పాటు పలువురు ఉపాధ్యాయులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

11వ వార్డులో భోజనాలు

సాలూరు: పట్టణంలో 11వ వార్డులో ఎమ్మెల్యేగా గుమ్మిడి సంధ్యారాణి విజయం సాధించటంతో వార్డుకు చెందిన నాయకురాలు బొంగ బాలమ్మ సుమారు 1500 మందికి భోజనాలు పెట్టించారు. సంధ్యారాణి ఘన విజయం సాధించటంతో పాటు మంత్రిగా పదవి వరించటం చాలా ఆనందంగా ఉందన్నారు. ● మంత్రిగా బాధ్యతలు స్వీకరించనున్న సంధ్యారాణిని మాజీ మంత్రి పడాల అరుణ ఆదివారం ఆమె నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జీవో నెం.117 రద్దుకు కృషి చేయాలి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి పీఆర్టీయూ పార్వతీపురం మన్యం జిల్లా శాఖ తరఫున ఆదివారం అభినందనలు తెలిపారు. సాలూరులో మంత్రి స్వగృహంలో పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అమరపు సూర్యనారాయణ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందించారు. జీవో నెం.117రద్దుకు కృషి చేసి విద్యావ్యవస్థ బాగుకు కారకులు కావాలన్నారు. నూతన వేతన సవరణ కోసం మొదటి క్యాబినెట్‌లో ముఖ్యమంత్రి ద్వారా తీపి కబురు అందించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర కార్యదర్శి జక్కు రామినాయుడు, గున్నరాజు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు భోగి రవికుమార్, మొయిద కృష్ణారావు, ఐటీడీఏ విభాగం కన్వీనర్ సాకేటి దాలయ్య, లక్షుంనాయుడు, అప్పారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యలపై దృష్టి సారిస్తా

● ఎమ్మెల్యే జగదీశ్వరి



ఎమ్మెల్యే జగదీశ్వరిని అభినందిస్తున్న గౌరునాయుడు

గరుగుబిల్లి: జల వనరులశాఖ సిబ్బంది సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యేను రాష్ట్ర జల వనరులశాఖ, రహదారులు, పంచాయతీరాజ్, పబ్లిక్ హెల్త్ వర్క్ చార్జ్‌డు ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి మరడా గౌరునాయుడు ఎమ్మెల్యేగా ఎంపికైన ఆమెను అభినందనలు తెలిపారు. పలు శాఖల పరిధిలోని ప్రధాన సమస్యలు ఆయా మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు.

బాధిత కుటుంబానికి అండగా నిలవాలి



హతుని తల్లిని ఓదారుస్తున్న ఆనంద్‌కుమార్

నెల్లిమర్ల: నగర పంచాయితీ పరిధిలోని కొండపేటలో ఇటీవల హత్యకు గురైన బాలుడి కుటుంబానికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని టీడీపీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్ కోరారు. ఆయన ఆదివారం సాయంత్రం కొండపేటలోని హతుని తల్లి కారెపు భారతిని, కుటుంబీకులను పరామర్శించి, రూ.10వేలు సాయం ప్రకటించారు. నిందితులకు శిక్ష పడే వరకు పోరాటం చేస్తామని, డీఎస్పీ స్థాయి అధికారులతో చర్చిస్తామని తెలిపారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యువకులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. యువకులు గంజాయి తదితర మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కొండపేట నాయకులు ఆల్తి శ్రీనివాసరావు, నడిపేన నారాయణరావు, నగర పంచాయతీ నాయకుడు లెంక అప్పలనాయుడు, బాధిత కుటుంబ సభ్యుడు కారెపు కన్నబాబు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం పటిష్ఠతకు కృషి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు

నెల్లిమర్ల: విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం పటిష్ఠతకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కాకినాడ ఉమామహేశ్వరరావు అన్నారు. నెల్లిమర్లలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా సంఘం ఇంత కాలం జిల్లా కేంద్రానికి పరిమితం అయిందని, ఈ సంఘాన్ని మండల స్థాయిలో విస్తరింపజేసి జిల్లాలో బలోపేతం చేయాలని నిర్ణయించామని చెప్పారు. ఉద్యోగులు ఐక్యంగా ఉండాలన్నారు. పేద, బడుగ, బలహీనవర్గాల విశ్వబ్రాహ్మణుల భరోసాగా నిలిచేందుకు, ఆసరాగా ఉండేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెదురుపర్తి ఉమాపతి, కార్యనిర్వాహక కార్యదర్శి కె.సోమశేఖర్, సభ్యుడు అండలూరి మోహనరావు, రిటైర్డు ఎంఈవో ఆరిపాక కృష్ణమాచారి, రిటైర్డు ఉపాధ్యాయుడు కర్రి రామాచారి తదితరులు ప్రసంగించారు. ఆరిపాక శ్రీనివాసరావు, అప్పలాచారి, కడలి సత్యసాయి గణేష్, కడలి రమేష్, ఆరిపాక బాబూ విశ్వేశ్వరరావు, షన్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాయత్రీ జయంతి

కురుపాం: కురుపాం గాయత్రీ శక్తి పీఠంలో ఆదివారం గాయత్రీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఐదు కుండీల గాయత్రి మహా యజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. అలాగే మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు.

సత్యసాయి భజన మండలిగా గుర్తింపు

పాలకొండ: మండలంలోని పనుకువలస శ్రీసత్యసాయి భజన సెంటర్‌ను శ్రీసత్యసాయి భజన మండలిగా గుర్తించారు. జోనల్ కన్వీనర్ కె.జగన్మోహన్‌రావు ఆధ్వర్యంలో కన్వీనర్ ముకుందరావు నేతృత్వంలో మన్యం జిల్లా అధ్యక్షుడు నేతాజీ నాయుడు గుర్తింపును ప్రకటించారు. ఈసందర్భంగా వీరఘట్టం, పాలకొండ మండలాల నుంచి అధిక సంఖ్యలో సత్యసాయి భక్తులు పాల్గొన్నారు. అనంతరం దివ్యజీవన సత్సంగం సమావేశం నిర్వహించారు. నేతాజీనాయుడు, ముకుందరావు, రాజ్‌కుమార్, పాలకొండ సత్యసాయి ప్రతినిధి ఎన్వీ రమణ పాల్గొని ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. అనంతరం నారాయణసేవ భక్తులకు చేశారు. ఈ కార్యక్రమం లో ఆధ్యాత్మిక వక్తలు సామంతుల దామోదరరావు, మహేశ్వరి, ఝాన్సీ పాల్గొన్నారు.

డీఎస్సీ ప్రకటించడం హర్షణీయం

గుమ్మలక్ష్మీపురం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించడం హర్షణీయమని ట్రైబుల్ రైట్స్ ఫోరం(టీఆర్ఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణ అన్నారు. ఆయన ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రత్యేకించి ఆదివాసీ ప్రాంతంలో ఉన్న యువతీ యువకులందరూ సంతృప్తికరంగా ఉన్నారని చెప్పారు. అయితే జీవో నెంబర్-3ను రద్దు చేసి డీఎస్సీపై ముందుకు అడుగులు వేయాలని కోరారు.

స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలి



సమావేశంలో పాల్గొన్న ఆదివాసీ జేఏసీ సభ్యులు

పార్వతీపురంటౌన్: గిరిజన యువతి, యువకులకు మేలు చేకూర్చే విధంగా మెగా డిఎస్సీతోపాటు స్పెషల్ డీఎస్సీని వెంటనే ప్రకటించాలని ఆదివాసీ జేఏసీ నాయకులు ఎన్.జయరాజు, కె.ధర్మారావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గిరిజన భవనంలో జేఏసీ సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం చంద్రబాబు మెగా డిఎస్సీపై తొలి సంతకం చేయడం సంతోషదాయకమన్నారు. అయితే గిరిజన ప్రాంతాల్లో విద్యను అభ్యసించిన విద్యార్థులకు స్పెషల్ డిఎస్సీ ప్రకటించకపోవడం వల్ల నష్టం జరిగే అవకాశం ఉందని చెప్పారు. ఆదివాసీ ఉద్యోగాలకు సంబంధించి నూతన చట్టాలను తీసుకు రావాలని కోరారు. ప్రస్తుత సీఎం అరకు లోయతో పాటు కురుపాం ఆదివాసీ ప్రాంతాల్లోగల నిరుద్యోగ యువతకు 100 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చామని చెప్పారు. మెగా డిఎస్సీతో పాటు ఐదో షెడ్యూలు నిబంధనలకు అనుగుణంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేసి బ్యాక్ లాగు పోస్టులను ప్రకటించాలన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

గరుగుబిల్లి: ప్రతిఒక్కరూ గ్రంథాలయాలను వినియోగించుకోవాలని స్థానిక శాఖా గ్రంథాలయ నిర్వాహకుడు నల్ల మధుసూదన రావు సూచించారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయంలో విద్యార్థులకు, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచామని చెప్పారు. విద్యార్థులకు పుస్తక పఠనంతో పాటు పలు క్రీడలు, ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.



విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయ అధికారి

చంద్రబాబుతోనే బీసీలకు న్యాయం



మాట్లాడుతున్న రామ్‌మోహనరావు

గరుగుబిల్లి: ఆర్థికంగా వెనుకబడిన బీసీ వర్గాలకు ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే న్యాయం జరుగుతుందని టీడీపీ అరకు పార్లమెంటు బీసీ సెల్ చైర్మన్ బూరాడ రామ్‌మోహన్‌రావు అన్నారు. మండల కేంద్రంలో ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ హయాంలో దాడులే తప్ప న్యాయం జరగలేదన్నారు. గత ఐదేళ్లుగా హామీలతోనే కాలయాపన చేసిన ప్రభుత్వాన్ని చూశామని, ప్రస్తుతం ప్రజల కోసం పాటుపడే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రితో పాటు ఇతర మంత్రుల దృష్టికి తీసుకు వెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో పలువురు ప్రతినిధులు ఉన్నారు.